ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 17 జూలై 2024



దివ్యాంగులకు నేషనల్ స్కాలర్‌షిప్స్

కలెక్టరేట్, జూలై 16: దివ్యాంగ విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఈ విద్యా సంవత్సరానికి ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోందన్నారు. జిల్లాలోని 9, 10వ తరగతి దివ్యాంగ విద్యార్థులు ఆగస్టు 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్ నుంచి గ్రాడ్యుయేట్ విద్యార్థుల దరఖాస్తుకు అక్టోబరు 31వరకు గడువు ఉందన్నారు.

ఒక్క అధికారే.. రెండేసి శాఖలు

- కీలక విభాగాలకు ఇన్‌చార్జిలే దిక్కు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- అంతంతమాత్రమే అభివృద్ధి
- రెగ్యులర్ అధికారులను నియమిస్తేనే ప్రగతి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో కొన్ని కీలక ప్రభుత్వ శాఖల్లో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. గత్యంతరం లేకనో... మరే ఇతరత్రా కారణాలతోనో... కొన్ని ప్రభుత్వ శాఖలు వేర్వేరుగా ఉన్నా.. అధికారి మాత్రం ఒక్కరే ఉంటున్నారు. దీంతో అటు మాతృశాఖకూ.. ఇటు అదనపు బాధ్యతలు చేపట్టిన శాఖకూ సమన్యాయం చేయలేకపోతున్నారు. ఐసీడీఎస్, డీఎస్‌వో, నగరపాలకసంస్థ, సుడా, ప్రభుత్వ వైద్యకళాశాల, గృహనిర్మాణశాఖ, విద్యాశాఖ, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ తదితర శాఖల్లో ఇన్‌చార్జిలే దిక్కవుతున్నారు. ప్రభుత్వ ప్రగతి స్పష్టం కావాలంటే.. అధికారుల పనితీరు ముఖ్యమే. రెగ్యులర్ అధికారులను నియమించక పోవడం, ఒక్కో అధికారికి రెండేసి శాఖలు అప్పగించడంతో.. ప్రగతి అంతంతమాత్రమే కనిపిస్తోంది.

కీలక విభాగాల్లో.. అధికారులు ఎఫ్ఏసీలే...

శ్రీకాకుళం నగరపాలక సంస్థ అత్యంత కీలకమైనది. సార్వత్రిక ఎన్నికల సమయానికి కొద్దిరోజుల ముందు అప్పటి శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును బదిలీ చేశారు. ఆయనను పదోన్నతిపై శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)కి వైస్ చైర్మన్‌గా నియమించారు. ఆ తర్వాత ఐఏఎస్ అధికారిణి తమీమ్ అన్సారియాను శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. ఆమె సుమారు మూడు నెలలు మాత్రమే విధులు నిర్వహించారు. ఇక్కడ నుంచి ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిపోయారు. దీంతో 'సుడా' వైస్‌చైర్మన్ చల్లా ఓబులేసును శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఎఫ్ఏసీ(పూర్తి అదనపు బాధ్యతలు)తో నియమితులయ్యారు. ఈయన అటు 'సుడా' బాధ్యతలనూ.. ఇటు నగరపాలక సంస్థ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. రెండు వేర్వేరు విభాగాలకు సంబంధించి ఒకే అధికారి బాధ్యతలను చూసుకోవడమన్నది కష్టతరమే. దీనివల్ల ఈ రెండు విభాగాల ప్రగతి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, అసోసియేట్ ప్రొఫెసర్లు కూడా ఇన్‌చార్జిలే అధిక మంది కొనసాగుతున్నారు.

డిప్యూటీ డీఈవోలు ఇన్‌చార్జిలే..

విద్యాశాఖలో డిప్యూటీ డీఈవో పోస్టులు ఇన్‌చార్జిలతో నెట్టుకువస్తున్నారు. శ్రీకాకుళం బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి.. శ్రీకాకుళం డిప్యూటీ డీఈవో ఇన్‌చార్జిగానూ వ్యవహరిస్తున్నారు. అలాగే పోలవరం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు విలియమ్స్.. టెక్కలి డిప్యూటీ డీఈవో ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జిలు.. ఆపై రెండేసి బాధ్యతలతో అధికారులు దేనికీ సమగ్ర న్యాయం చేయలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ పాలనలో అధికారుల పర్యవేక్షణ కరువవడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో.. ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయనే విమర్శలున్నాయి. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా.. కీలక విభాగాలపై దృష్టి సారించి.. రెగ్యులర్ అధికారులను నియమించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.






జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

ఆ రెండు శాఖలకూ ఒకరే..

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బి.శాంతిశ్రీ వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు.. బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ ప్రక్రియను ఆమె పర్యవేక్షించాల్సి ఉంది. తరుచూ సమీక్షలు చేపట్టాల్సి, ఈ అధికారిణే... ప్రజాపంపిణీ వ్యవస్థకు డీఎస్‌వోగా ఎఫ్ఏసీతో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో వాహనాల ద్వారా లబ్ధిదారులకు సరుకుల పంపిణీ, ఎంఎల్ఎస్ పాయింట్లు.. డీడీల సేకరణ.. రేషన్ డీలర్లకు చేరాల్సిన సరుకులు తదితర వాటిపై సమగ్రంగా పర్యవేక్షించాలి. అటు ఐసీడీఎస్, ఇటు ప్రజాపంపిణీ వ్యవస్థ బాధ్యతలు ఒక్క అధికారే ఎలా చేపట్టగలరన్నదీ సందేహమే. సరైన పర్యవేక్షణ లేక ఈ రెండు శాఖల్లో తరచూ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. డీఎస్‌వోగా రెగ్యులర్ అధికారిని నియమిస్తేనే ప్రజాపంపిణీ వ్యవస్థ గాడిన పడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

అక్కడ ఆడిట్ అధికారి..
ఇక్కడ హౌసింగ్ పీడీ...

జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారిగా బి.నగేష్ వ్యవహరిస్తున్నారు. కోఆపరేటివ్ విభాగంలో ఆడిట్ ప్రకారం లెక్కలు సరిపోయాయా.. ఎక్కడైనా తారుమారు అయ్యాయా అన్నది పర్యవేక్షణ చేయడం ఆయన విధులు. కాగా.. ఇటీవల జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ గణపతి పదవీ విరమణ చెందారు. ఆయన స్థానంలో జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి నగేష్‌ను ఎఫ్ఏసీ బాధ్యతలతో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. దీంతో రెండు కీలక శాఖలకు ఈయనే బాస్. గృహ నిర్మాణశాఖ.. ప్రభుత్వ ప్రగతిని ప్రతిబింబించే శాఖలో ఒకటి. జిల్లాలో ఇప్పటికే గత ప్రభుత్వంలో గృహనిర్మాణ శాఖ పనితీరు మూడడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కు చందాన రీతిన తయారైంది. లబ్ధిదారుల అవస్థలు... ఇటు బిల్లుల చెల్లింపులు కాక అనేక ఇబ్బందులు ఉన్నాయి. గృహ నిర్మాణ శాఖ విభాగంలో ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) వంటి కీలక అధికార పోస్టులో కూడా ఇన్‌చార్జే ఉన్నారు. దీంతో హౌసింగ్ ప్రగతి తప్పింది. ఒక్కో శాఖకు ఒక్కో ఉన్నతాధికారిని నియమించడం లేదా.. కిందిస్థాయి సిబ్బందినైనా ఇన్‌చార్జిలుగా కాకుండా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తేనే సత్ఫలితముంటుంది.


నీలిరంగు గ్రానైట్‌పై
ఎంఎస్‌పీ గ్రానైట్ క్వారీ

వైసీపీ నేతల కన్ను

- యజమాని కోర్టును ఆశ్రయించడంతో వెనక్కి తగ్గిన వైనం
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు వెల్లడి

టెక్కలి, జూలై 16: 'టెక్కలి సమీపంలో నీలిరంగు గ్రానైట్ నిక్షేపాలు గల లింగాలవలస రెవెన్యూ పరిధి సర్వేనెం.71లో 4.517 హెక్టార్ల ఎంఎస్‌పీ గ్రానైట్ క్వారీపై అప్పటి వైసీపీ నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కన్ను పడింది. ఎలాగైనా లీజులు రద్దు చేయించి.. ఈ క్వారీని చేజిక్కించుకునేందుకు పావులు కదిపారు. అడిషినల్ అడ్వకేట్ జనరల్ కుమారుడు కార్తీకరెడ్డి కూడా ఈ క్వారీ లీజుల కోసం కొంతకాలం తర్వాత దరఖాస్తు చేసుకున్నాడు. ఇలా వైసీపీ నేతలు అప్పట్లో ఈ క్వారీని చేజిక్కించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. ఎంఎస్‌పీ క్వారీ యజమాని పలనవేలు.. కోర్టును ఆశ్రయించడంతో వారి ప్రయత్నాలు బెడిసికొట్టాయి' అని సీఎం చంద్రబాబు తెలిపారు. సోమవారం అమరావతిలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గనులశాఖలో అక్రమాలు అంశంలో మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

- 2020లో లింగాలవలస ఎంఎస్‌పీ క్వారీలో అక్రమ తవ్వకాలు జరిగాయంటూ అప్పటి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి క్వారీ యజమానికి రూ.215 కోట్లు అపరాధ రుసుం విధించారు. తాను తప్పు చేయలేదని, పద్ధతి ప్రకారమే క్వారీ నిర్వహించానని యజమాని పలనవేలు కోర్టును ఆశ్రయించారు. ఈలోగా అప్పటి గనులశాఖ అధికారులు క్వారీ లీజు రద్దుకు సిఫారసు చేస్తూ పర్మిట్లను రద్దుచేశారు. దీంతో పలనవేలు.. తాను ఏ తప్పిదానికి పాల్పడలేదని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఓవైపు విజిలెన్స్, మరోవైపు గనుల శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నా.. పలనవేలు పట్టువీడకుండా కోర్టులను ఆశ్రయించారు. దీంతో చేసేది లేక ఈ క్వారీ లీజును కైవసం చేసుకునేందుకు ప్రయత్నించిన వైసీపీ పెద్దలు వెనక్కి తగ్గారు. క్వారీలో అక్రమాలు జరిగాయని పలుసార్లు తనను వేధిస్తున్నారంటూ వీటిపై సర్వే చేయాలని పలనవేలు హైకోర్టులో మరోసారి వాజ్యం వేశారు. దీంతో అప్పట్లో హైకోర్టు ఉత్తర్వుల మేరకు 17 రోజుల పాటు డెహ్రాడూన్ నుంచి వచ్చిన జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం సర్వే చేసి అక్రమ తవ్వకాలు జరగలేదని ధ్రువీకరించింది. అప్పటికే క్వారీలీజుల రద్దుకు సిఫారసు చేయడంతో.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు క్వారీ యజమాని పలనవేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చివరకు సుప్రీంకోర్టు ఉత్తర్వులతో క్వారీ లీజును కొనసాగిస్తూ పర్మిట్లు మంజూరయ్యాయి. దీంతో ఈ క్వారీని ప్రస్తుతం ఎంఎస్‌పీ క్వారీ యజమాని పలనవేలు నిర్వహించుకుంటున్నారు. మూడున్నరేళ్లకు పైగా ఆయనకు వైసీపీ పెద్దలు అనేక అడ్డంకులు సృష్టించినా.. హైకోర్టు, సుప్రీంకోర్టు పుణ్యమా అని క్వారీని నడుపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవహారంపై సీఐడీ ఆరా తీయడంతో ఈ సమాచారం బయటకు పొక్కింది.

భూసారంపై దృష్టి

- గత నాలుగేళ్లు పట్టించుకోని వైసీపీ
- నిధులు లేక.. అటకెక్కిన పరీక్షలు
- రైతులకు తప్పని ఇక్కట్లు

(ఇచ్ఛాపురం)

వైసీపీ ప్రభుత్వం.. వ్యవసాయ రంగాన్ని కూడా నిర్వీర్యం చేసింది. ప్రధానంగా భూసార పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించింది. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఖరీఫ్ వేళ.. భూసార పరీక్షల వేగవంతానికి చర్యలు చేపడుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలోని రైతులు తమ పొలాల్లో మట్టి సాంద్రత తెలుసుకునేందుకుగానూ టీడీపీ హయాంలో కొన్నేళ్ల కిందట ఆమదాలవలసలో భూసార పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి మట్టి నమూనా లు పంపించిన భూసారం బట్టి జాగ్రత్తలు తీసుకుని.. సాగు చేసేవారు. పంటలు బాగా పండి లబ్ధి పొందే వారు. కాగా.. వైసీపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత భూసార పరీక్షా కేంద్రానికి అవసరమైన నిధులను ఒక్క ఏడాది 2019-2020లో మాత్రమే కేటాయించింది. తర్వాత నాలుగేళ్లు నిధుల ఊసే లేదు. మట్టి నమూనాలను పరీక్షించేందుకు రసాయనాలతోపాటు కంప్యూటర్లు, సిబ్బంది నిర్వహణకు కనీసస్థాయిలో కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో నాలుగేళ్లుగా భూసార పరీక్షలు జరగలేదు. భూసార పరీక్షా కేంద్రంలో పరికరాలు నిరుపయోగంగా మారి పాడైపోయాయి.

నాలుగేళ్లుగా అవస్థలు..

వ్యవసాయంలో ప్రధానమైన తంతు భూసార పరీక్షలు. భూమిలో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో భూసార పరీక్షలు ద్వారా తెలుసు కుంటారు. అలాగే సూక్ష్మ పోషకాలైన ఐరన్, జింక్ తదిత రాలు ఎంత నిష్పత్తిలో ఉన్నాయో, వాటి పీహెచ్ వాల్యూ ఎంత ఉందో ఈ పరీక్షల ద్వారా తెలుసుకుంటారు. పీహెచ్ వాల్యూ 7.1 ఉంటే భూమి పంటలు సాగుకు అనువుగా ఉంటుంది. స్థూల, సూక్ష్మ పోషకాలు తగిన నిష్పత్తిలో లేకుంటే ఏయే రసాయన మందులు వాడాలో భూసార పరీక్ష కేంద్రాల నిపుణులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరిస్తారు. వారి సూచన మేరకు రైతులు వరి, ఉద్యాన పంటల సాగులో రసాయనాలు వాడి భూసార సాంద్రతను మెరుగు పరుచుకుంటారు. కానీ జిల్లాలో నాలుగేళ్లుగా గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భూసార పరీక్షలు నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే అధికారులను అప్రమత్తం చేశారు. భూసార పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జిల్లాలో 19వేల మట్టి నమూనాలు సేకరించారు. ఆయా మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు వాటిని ఆమదాలవలసలో కేంద్రానికి తరలించి భూసార పరీక్షలు చేయిస్తున్నారు. ఫలితాలను బట్టి రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలిచ్చి.. సాగును ప్రోత్సహిస్తున్నారు.

- 'జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3.50 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. అలాగే పదివేల ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నారు. ఈ ఏడాది 27వేల భూసార పరీక్షలు లక్ష్యం కాగా.. ఇప్పటికే 19వేల మట్టి నమూనాలు సేకరించాం. భూసార పరీక్షలు వేగవంతం చేస్తున్నాం. భూసార నమూనా సేకరణకు అదనంగా ఇద్దరు ఏవోలు, నలుగురు ఏఏవోలను నియమించా'మని జిల్లా వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్ తెలిపారు.




లొద్దపుట్టిలో భూసార పరీక్షలు..

మరో విషాదం

- ఉగ్రవాదుల దాడిలో ఇంకో ఆర్మీ జవాన్ మృతి
- చెట్లతాండ్రలో శోకసంద్రం

సంతబొమ్మాళి, జూలై 16: నందిగాం మండలం వల్లభరాయుడుపేటకి చెందిన ఆర్మీ హవల్దార్ సనపల జగదీశ్వరరావు(40).. సోమవారం జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల ఎదురుదాడుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువకముందే జిల్లాకు చెందిన మరో జవాను ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన ఆర్మీజవాను డొక్కరి రాజేష్(25) ఉగ్రవాదుల దాడిలో సోమవారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈయన జమ్మూకశ్మీర్ డూడి సెక్టార్‌లో విక్టర్ ఫోర్స్ 10ఆర్ఆర్ బెటాలియన్-ఏ కంపెనీ టెర్రరిస్టుల కోసం ఆపరేషన్ చేస్తుండగా ఉగ్రవాదుల దాడి జరిగినట్టు తెలి సింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

- రాజేష్ తల్లిదండ్రులు చిట్టివాడు, పార్వతి.. గొర్రెలు కాపరులుగా జీవనం సాగిస్తున్నారు. రాజేష్ 2018 ఆగస్టు లో ఆర్మీలో చేరారు. ఆయన తమ్ముడు మధుసూదన్ డిగ్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. రాజేష్‌కు ఇటీవల నెల రోజుల సెలవులు ఇవ్వడంతో గ్రామంలోని అమ్మవారి పండుగకు వచ్చారు. కుటుంబంతో ఆనందంగా గడిపారు. మే 13న నిర్వహించిన ఎన్నికల పోలింగ్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. సెలవుల అనంతరం ఇటీవల తిరిగి విధులకు వెళ్లిపోయారు. కాగా.. ఉగ్రవాదుల దాడిలో రాజేష్ మృతి చెందారన్న సమాచారం మంగళవారం ఉదయం 5 గంటలకు కుటుంబ సభ్యులకు ఆర్మీ అధికారులు తెలియజేశారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. రాజేష్ అందరితో కలివిడిగా ఉండేవాడని, సెలవులకు వచ్చినప్పుడు నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం చేసేవాడని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. దేశ సేవలో అమరుడయ్యాడని విచారం వ్యక్తం చేశారు. రాజేష్ మృతిచెందాడనే విషయాన్ని.. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు సర్పంచ్ పంగ అసిరినాయుడు తెలియజేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెంటనే ఆర్మీ అధికారులతో మాట్లాడి భౌతిక కాయాన్ని స్వగ్రామానికి త్వరగా రప్పించాలని కోరారు. మృతుడి కుటుంబానికి మంత్రి అచ్చెన్నాయుడు.. ప్రగాఢ సంతాపం తెలిపారు.


రాజేష్ (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నేడు ఆర్మీ హవల్దార్ అంత్యక్రియలు

- కేంద్ర, రాష్ట్రమంత్రుల సంతాపం
- విషాద వదనంలో కుటుంబం

నందిగాం, జూలై 16: ఉగ్రదాడిలో వీరమరణం పొందిన ఆర్మీ హవల్దార్ సనపల జగదీశ్వరరావు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం వల్లభరాయుడుపేటలో జరగనున్నాయి. జగదీశ్వరరావు మృతితో భార్య సమత, తల్లిదండ్రులు నారాయణమ్మ, మల్లేశ్వరరావు, కుమార్తెలు మోక్షప్రియ, దీక్షితతో పాటు బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఆయన మృతదేహం రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జగదీశ్వరరావు మృతదేహాన్ని జమ్మూ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి, అక్కడ నుంచి విశాఖకు మంగళవారం రాత్రి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం స్వగ్రామంలో సంతాప ర్యాలీ నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు.. మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అలాగే మంగళవారం వైసీపీ జిల్లా సమన్వయ కర్త పేరాడ తిలక్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, జె.జయరాం తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దిగ్భ్రాంతి కలిగించింది

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూలై 16: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఆర్మీ సైనికులు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధకశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఆర్మీ జవాన్లు సనపల జగదీశ్వరరావు, డొక్కరి రాజేష్‌కు దేశ ప్రజలంతా రుణపడి ఉంటారని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


విలపిస్తున్న జగదీశ్వరరావు కుటుంబ సభ్యులు

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షకు షెడ్యూల్

ఎచ్చెర్ల, జూలై 16: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2011-2015 విద్యాసంవత్సరాల మధ్యలో ఏడాది కాల వ్యవధి పరీక్ష విధానంలో చదువుకుని.. కొన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులుకాని విద్యార్థులకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ పరీక్ష నిర్వహించేందుకు వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. 'ప్రయోగ పరీక్షలు ఆగస్టు 22నుంచి 31వరకు, థియరీ పరీక్షలు సెప్టెంబరు మూడో తేదీ నుంచి నిర్వహించనున్నాం. ఒక సబ్జెక్టుకు రూ.3వేలు చొప్పున రుసుం చెల్లించాలి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఒక్కో ఏడాదిలో అన్ని సబ్జెక్టుల పరీక్షకు హాజరుకావాలంటే రూ.8వేలు, తృతీయ సంవత్సరంలో అన్ని సబ్జెక్టులకుగాను రూ.10వేలు ఫీజు చెల్లించాలి. విద్యార్థులు ఆయా కళాశాలల్లో వచ్చేనెల 14లోగా ఫీజు చెల్లించాలి. ఆగస్టు 20న హాల్‌టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలి' అని ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సెమిస్టర్ విధానంలో కాకుండా ఏడాదికోసారి డిగ్రీ పూర్తిచేసి కొన్ని సబ్జెక్టులు తప్పిపోయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిక్సూచి

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్' ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్.జీ.రంగా వర్సిటీ అగ్రిసెట్



విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

అర్హత: ఏఎన్‌జీఆర్ఏయూ/పీజేటీఎస్ఏయూ నుంచి రెం డేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఏఎన్‌జీఆర్ఏయూ అగ్రిసెట్ తేదీ:** ఆగస్టు 27 ● **వెబ్‌సైట్:** angrau.ac.in

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AT8a4gNలో చదవండి.

SCHOLARSHIP ALERT

Panasonic Ratti Chhatr Scholarship

Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date: 15-08-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/RCSP56

buddy4study.com

పోటీ పరీక్షల దిక్సూచి

కొత్త పుస్తకం

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా...ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌర స్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.



పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)

పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)

వెల: రూ.899/-

ప్రతులకు: శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080 **ఫోన్ నెం:** 8686430054, 8686430055

నవ్య | చిత్రజ్యోతి

బ్రహ్మారాక్షసుడిలా...



తమిళ కథానాయకుడు ధనుష్ 50వ చిత్రం 'రాయన్'. ఈ సినిమాకు ఆయనే దర్శకుడు కూడా. సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'బ్రహ్మారాక్షసుడిలా వస్తాడు.. దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ ప్యాక్డ్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ఇందులో నటించిన సందీప్‌కిషన్, ప్రకాశ్‌రాజ్, ఎస్.జె.సూర్య, కాళిదాస్ జయరామ్ ముఖ్య పాత్రలో కనిపించారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ నేపథ్యం సంగీతం అలరించింది. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ నెల 26న 'రాయన్' చిత్రం విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేశ్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేయనుంది.

ఆ రోజులు మళ్లీ రాకూడదు



'గడచిన మూడేళ్లు ఎన్నో ఆటుపోట్లు చవిచూశాను. నా జీవితం తీవ్రమైన ఒడిదుడుకులతో గడిచింది. ఆ రోజులు నా జీవితంలో మళ్లీ రాకూడదు అని కోరుకుంటున్నాను' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె ఇటీవలే ఓ మీడియా ఇంటర్వ్యూలో తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'మన జీవితాల్లో కొన్ని సంఘటనలు చేదు అనుభవాలుగా మిగిలిపోతాయి. ఎంత ప్రయత్నించినా మనం వాటిని ఆపలేం. అలాంటప్పుడు వాటిని అంగీకరించి, అధిగమిస్తూ ముందుకెళ్లడమే మనం చేయాల్సింది. కష్టకాలంలో ఆధ్యాత్మికత నాకు స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా నాలో మంచి మార్పులకు కారణమైంది. ఈతరం ఎక్కువగా మానసిక అనారోగ్యానికి గురవుతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు. ప్రస్తుతం నా జీవితం బావుంది. నేను మునుపటికన్నా బావున్నాను' అని సమంత చెప్పారు. కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన విషయం కెమెరా ముందు నిల్చోవడమే. ఆగస్టు నుంచి కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటాను. నా పాత్ర కోసం తర్ఫీదు అవుతున్నాను. విలువిద్య, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అందుకే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉన్న కథలనే ఎంపిక చేసుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. సమంత స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'లో నటిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ-బన్నీ' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ అవనుంది.

ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విజయం




'నా సినీ జీవితంలో 200కు పైగా సినిమాలు చేశాను. అయితే వాటిలో అన్ని సినిమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. కానీ 'కల్కి 2898 ఏడీ' విజయాన్ని మాత్రం కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలి. సినిమా విడుదలైనప్పటి నుంచి నాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి' అని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు రూ. వెయ్యికోట్ల వసూళ్లను అధిగమించిన సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన కమల్‌హాసన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "కల్కి చిత్రానికి వసూళ్ల పరంగా వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో యాస్కిన్ పాత్ర కోసం చాలా కసరత్తు జరిగింది. చాలా కష్టపడ్డాం. మేకప్ కోసం లాస్ ఏంజెల్స్ వెళ్లాం. మొదట్లో నా గెటప్ చూసి నాకే ఎబ్బెట్టుగా అనిపించినా, క్రమంగా ఉత్సాహం కలిగింది. రెండో భాగంలో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజాలు అంతా ఈ చిత్రంలో కలసి నటించారు. ఒకప్పుడు సింగీతం శ్రీనివాసరావులా ఇప్పుడు నాగ్ అశ్విన్ కూడా ప్రేక్షకులను మాయ చేశారు. చిన్నపిల్లలు ఆటలో లీనమైపోయినట్లు పాత్రధారులందరూ తమ తమ పాత్రల్లో జీవించారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎంత సంతోషిస్తే మేము అంతగా సంతోషిస్తాం' అని పేర్కొన్నారు.

విలన్‌గా అభిషేక్ బచ్చన్



బాలీవుడ్‌లో ఒక్కో హీరో ఇప్పుడు విలన్‌గా మారుతున్నాడు. సంజయ్‌దత్, సైఫ్ అలీఖాన్, రణ్‌వీర్ సింగ్, బాబీ డియోల్... ఇలా . తాజాగా ఈ జాబితాలోకి అభిషేక్ బచ్చన్ చేరబోతున్నారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం 'కింగ్'లో అభిషేక్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి అమితాబ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'ఇదే సమయం' అంటూ తనయుడు అభిషేక్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు అమితాబ్. గత ఏడాది 'జవాన్', 'పఠాన్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు 'కింగ్' చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కుమార్తె సుహానా ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'కింగ్' చిత్రానికి సుజయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాస్‌ను ఆకట్టుకునేలా...



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ అందరికీ నచ్చడమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మార్ ముంతా చోడ్ చింత'ను మేకర్స్ విడుదల చేశారు. మాస్‌ను ఆకట్టుకునేలా ఈ సాంగ్‌లోని లిరిక్స్, డాన్స్ మూమెంట్స్ సాగాయి. ఈ పాటకు శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్ సీపాన, కీర్తన శర్మ ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి

ముద్దు సీన్‌కు మూడు కట్స్



'యానిమల్' సినిమాలో బోల్డ్ సీన్స్‌లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించిన హాట్ గర్ల్ త్రిప్తి దిమ్రీ నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ న్యూజ్'. విక్కీ కౌశల్ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న విడుదల కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య ముద్దు సీన్లు మూడు ఉన్నాయట. ఈ మధ్యకాలంలో కిస్సింగ్ సీన్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెన్సార్ వారు 'బ్యాడ్ న్యూజ్' చిత్రం మీద కన్నెర్ర చేసి, కత్తెరకు పని చెప్పారట. విక్కీ, త్రిప్తి పై చిత్రీకరించిన ముద్దు సీన్లు మోతాదు మించి ఉన్నాయనీ, తగ్గించాలని సెన్సారు అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక వాటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. త్రిప్తి అభిమానులకు ఇది బ్యాడ్ న్యూసే కదూ!

పవర్‌ఫుల్ పాత్రలో



పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'సర్దార్ 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కొన్ని రోజుల క్రితమే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా చిత్రబృందం అప్‌డేట్ ఇచ్చింది. నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

ఆ రోజులు గుర్తొస్తున్నాయి



'ప్రతి సినిమాను ఎంతో ప్యాషన్‌తో తీసే నిర్మాత వేణుగోపాల్. ఆయనకు మంచి టేస్ట్ ఉంది. లవ్ స్టోరీస్ మీద పట్టుంది. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది' రోజులు గుర్తుకు వస్తున్నాయి' అన్నారు హీరో విష్వక్‌సేన్. 'రోటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'గలీజ్' సాంగ్‌ను ఆయన అవిష్కరించి మాట్లాడారు. సృజన్ కుమార్ బొజ్జం తో కలసి బెక్కం వేణుగోపాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఓ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలని ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ని నిర్మించాం. ఇటీవల కొంతమంది యూత్‌కి ఈ సినిమా చూపించాం. వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది' అన్నారు. ఆగస్టు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మరో నిర్మాత సృజన్‌కుమార్ చెప్పారు.

ఆకట్టుకునే విజువల్స్‌తో... 'మా ఊరి జాతరలో'



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫోక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సింధూరి విశాల్, హరిగౌర ఆలపించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్ : చోటా కె ప్రసాద్, డిఓపీ : ఎం. రిచర్డ్ నాథన్.

రాజ్ తరుణ్‌కు నోటీసులు ?



సినిమా హీరో రాజ్ తరుణ్‌పై లావణ్య చేసిన ఫిర్యాదులో రాజ్ తరుణ్‌ను విచారించేందుకు నార్సింగ్ పోలీసులు సిద్ధమయ్యారు. రేపు విచారణకు హాజరు కావాలని రాజ్‌తరుణ్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు పలు అంశాలపై ఆరా తీయనున్నారు. రాజ్ తరుణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. అయితే ఈ కేసులో నోటీసుల విషయంపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోసం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ముగ్గురు స్నేహితుల కథ



మక్కా శ్రీను, సుచిత్ర రాథోడ్, దిల్ రమేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్.ఐ.కోదండపాణి'. రెంటాల నాగేంద్ర దర్శకత్వంలో మక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ప్రీమియర్ షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెంటాల నాగేంద్ర మాట్లాడుతూ "కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాను తెరకెక్కించాను. ముగ్గురు స్నేహితులు ఓ మర్డర్ మిస్టరీలో ఇరుక్కుని ఎలా బయటపడారనేది సినిమా కథ" అని అన్నారు. "కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని నిర్మాత శ్రీదేవి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉదయ్, కెమెరామెన్: సబరి, సంగీతం: సాల్మన్.

సమాజానికి అవసరమైన ఇండియా ఫైల్స్



తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియా ఫైల్స్', ఇంద్రజ, సుమన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డాక్టర్ బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ఈ మూవీ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ప్రస్తుత సమాజానికి ఇలాంటి చిత్రం అవసరం" అని చెప్పారు. "ఈ సినిమా విడుదల తర్వాత ఇలాంటి తరహా కథలు మరిన్ని తెరకెక్కుతాయి. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చెప్పారు. "ప్రపంచంలో ప్రతీ మూలకు వెళ్లగలిగేది సినిమా మాత్రమే" అని దర్శకుడు బొమ్మకు మురళి తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్, డీఓపీ: జి.ఎల్.బాబు, సంగీతం:ఎమ్.ఎమ్.కీరవాణి.

మంచి కంటెంట్‌తో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డాక్టర్ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా విజువల్స్ బాగున్నాయి. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "ఇదొక విభిన్న తరహా సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు. ఈ సినిమాకు ఎడిటర్: శివ శర్వాని, డీఓపీ: రేవంత్ సాగర్, నిర్మాణ పర్యవేక్షణ: సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.

వృథా వ్యయం

పలాస మునిసిపాలిటీ, మండల పరిధిలో వైసీపీ ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టి సర్వే రాళ్లను భూమి చుట్టూ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. కొన్ని చోట్ల రాళ్ల ఏర్పాటు చేయగా మరికొన్ని గ్రామాల్లో రాళ్ల పాతకుండా ఇలా వృథాగా రోడ్ల పక్కన వది లేశారు. దీంతో ప్రజాధనం వృథా కాగా లక్ష్యానికి తూట్లు పడ్డాయన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. సవరగోవిందపురం, వీరభద్రాపురం, కైజోలతో పాటు ఇతర గిరిజన గ్రామాల్లో రోడ్డు పక్కన పడేసి ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోం దన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తగు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-పలాస రూరల్



సవరగోవిందపురం వద్ద రోడ్డు పక్కన ఉన్న సర్వే రాళ్లు

నీట మునిగిన పంట పొలాలు

కోవిలాం(ఎల్.ఎన్.పేట): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోవిలాం గ్రామ సమీపం లోని పంటపొలాలు నీటిలో మునిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళ వారం సాయంత్రం మూడు గంటల నుంచి గంట పాటు వర్షం కురవడంతో ఎగువప్రాంతాల నుంచి కాలువల గుండా నీరు వచ్చి పొలాల్లోకి చేరడంతో ఎద పొలాలు నీటిలో మునిగిపోయాయి. వరి ఎదలు మొక్కదశలో ఉండడంతో నీరు నిలువ ఉంటే పూర్తిగా కుళ్లిపోయి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు దిగువకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపో వడంతో పొలాల్లోకి చేరి నిలిచిపోతోందని, దీనికి తోడు వర్షపు నీరు చేరి తామంతా నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అధిక పెట్టుబడులతో పంట లపైన ఎన్నో ఆశలు పెట్టుకున్నామని అయితే వర్షాకాలం ప్రారంభంలోనే నష్టం వాటిల్లే పరిస్థితి ఎదురవుతోందని కోవిలాం గ్రామానికి చెందిన బి.తవుడు, ఎల్.మల్లేశ్వర రావు, గణపతి, లక్ష్మణరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకో వాలని వారు కోరుతున్నారు.



కోవిలాం సమీపంలో నీటిలో ఉన్న పంట పొలాలు

ప్రమాదకరం

వల్లభరాయుడుపాడు జంక్షన్ నుంచి వేణుగోపాలపురం వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉంది. 2018లో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.95 లక్షలతో పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. అప్పటి నుంచి మూడు కిలోమీటర్ల రహదారి రాళ్లు తేలి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనచోదకులు పేర్కొంటు న్నారు. రాత్రి సమయాల్లో గోతు లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని వారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-నందిగాం



రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్న వేణుగోపాలపురం రోడ్డు

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం

● జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి

టెక్కలి: ద్విచక్ర వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని, హెల్మెట్ ధరించడం తప్పనిసరని జూనియర్ సివిల్‌జడ్జి తేజా చక్రవర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి, గోపినాథపురం కూడలిలో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకో వచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ఎస్ఐ వెంకటేశ్వ రరావు, న్యాయవాది పేడాడ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ భూముల ఆక్రమణలపై సర్వే

హరిపురం: మందస మండలంలో పట్టు పరిశ్రమ శాఖ అధీనంలోని భూముల ఆక్రమణలపై కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. పరిశ్రమకు గతంలో 26 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో కొంత భూమి ఆక్రమణలకు గురైందని వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు ప్రారంభించారు. తహసీల్దార్ తిరుమలబాబు, సర్వేయర్ మోహనరావు, పట్టుపరిశ్రమ జిల్లా అధికారి రాజేంద్ర ప్రసాద్ భూముల్లో మంగళవారం సర్వే చేపట్టారు. ఎంత భూమి ఉంది, ఎంతమేర ఆక్రమణలకు గురైందన్న విషయాన్ని గుర్తించారు. దీనిపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వారు తెలిపారు. పట్టు పరిశ్రమ భూములకు రక్షణకు చర్యలు తీసుకోనున్నామన్నారు. పరిశ్రమ భూములను కొన్నింటిని వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీకి కేటాయించినట్లు గుర్తించారు. దీనిపై పూర్తి సమాచారం సేకరించారు. పట్టాలను పరిశీలించి, దీనికి అనుమతిచ్చిన అధికారుల వివరాలను నివేదికలో పొందుపర్చినట్లు తెలిపారు.

లంపీస్కిన్ నివారణకు టీకాలు

జలుమూరు: పశువుల్లో వచ్చే లంపీ స్కిన్ వ్యాధి నివారణకు ఈనెల 20 నుంచి వచ్చేనెల 18వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించి టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీ వి.జయరాజ్ తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో మంగళవారం పశు సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే లంపీస్కిన్ వ్యాధి నివారణకు 3.88 లక్షలు డోసులు సిద్ధం చేసినట్లు తెలిపారు. టెక్కలి డివిజన్‌కు 1.88 లక్షలు డోసులు, శ్రీకాకుళం డివిజన్‌కు 1.43 డోసులు అందుబాటులో ఉంచామన్నారు. అన్ని గ్రామాల్లో ఈ డోసులను పశువులకు వేసేలా పశు వైద్యులు పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ఆవుదూడల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల నివారణకు బ్రూసెల్లాసిస్ వాక్సిన్ వేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. 4 నెలలు నిండి 8 నెలల లోపు వయసున్న ఆడ దూడలకు ఈ వాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతులు, పెంపకందారులు వినియోగించుకునేలా అవగా హన కలిగించాలన్నారు. సమావేశంలో కోటబొమ్మాళి పశుసంవర్ధక శాఖ ఏడీ మంద లోకనాథం, జలుమూరు, అచ్యుతాపురం పశువైద్యాధికారులు ముద్దాడ దీప్తి, పట్ట సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను ఎమ్మార్సీగా మార్చొద్దు

● ఎంఈవోపై కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు



తొలగిస్తున్న గోడను చూపిస్తున్న గ్రామస్థులు

తాయివమాంబపురం(ఎల్ఎన్‌పేట): తాయిమాంబపురం ఆర్అండ్ఆర్ కాలనీకి (గార్లపాడు) చెందిన పాఠశాల భవనాన్ని ఎమ్మార్సీగా మార్చేందుకు ఎంఈవో మణికుమార్ చర్యలు తీసుకుంటు న్నారని, దీనిని నిలువరించాలని గ్రామానికి చెందిన జి.గోవిందరావు, ఎస్.అరుణ, ఎస్.మల్లేశ్వరరావు, కె.భూపతి తదితరులు కలెక్టర్‌కు, సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌లోనూ మంగళవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఉన్న రెండు గదుల మధ్య ఉన్న గోడను తొలగించి ఎమ్మార్సీగా మార్చేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దీనివల్ల పిల్లలు చదువుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకుని పాఠశాల గదులను పాఠశాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తొలగిస్తున్న గోడను చూపిస్తూ ఎంఈవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీనిపై ఎంఈవో మణికుమార్‌ను వివరణ కోరగా పాఠశాల గోడ నిర్మాణం చేపట్టి ఎమ్మార్సీ భవనం కాకుండా గ్రామస్థుల కోరిక మేరకు పాఠశాలగా ఉంచడం జరుగుతుందన్నారు.

వైభవంగా పీర్ల పండుగ

నరసన్నపేట/జలుమూరు: మతసామరస్యానికి ప్రతీకగా ప్రతిఏటా జలుమూరు మండల కూర్మనాథ పురంలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం పీర్ల ఊరేగింపు మంగళవారం నిర్వహిం చారు. నెలంతా పీర్లు నీళ్లలో పడేలా షేక్ యాకూబ్ నేతృత్వంలో గత పది రోజులు పాటు వివిధ కార్యక్రమాలను చేపట్టారు. గ్రామస్థులు పీర్లతో అగ్నిగుండం తొక్కారు. బిందెలతో దీపారాధన చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు చేరారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు

హరిపురం: మందస మండలం బహాడపల్లి గ్రామంలో అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్న పలు ఇళ్లపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఏడీఈ చంద్రమౌళి, డీఈఈతోపాటు ఏఈ ఎల్.యోగి ఈ దాడుల్లో పాల్గొని ఎంపీపీ డొక్కరి దానయ్య, మాజీ మంత్రి పీఏ జోగ కృష్ణారావుకు చెందిన ఇళ్లను పరిశీలించారు. ఎంపీపీ డొక్కరి దానయ్య ఇంటికి రెండు కనెక్షన్లు ఉండగా ఒకదానికి అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏడీఈ తెలిపారు. ఈ చౌర్యం ఎన్నాళ్ల నుంచి చేస్తున్నదీ గుర్తించి అపరాధ రుసుం వసూలు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం నేరమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై పూర్తి నివేదికను తయారుచేసి నోటీసులిచ్చి అపరాధ రుసుం వసూలు చేయనున్నట్లు ఏఈ యోగి తెలిపారు.

మండలానికి చేరిన బ్లీచింగ్, సున్నం

నందిగాం: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించి బ్లీచింగ్, సున్నం మంగళవారం మండల కేంద్రానికి చేరింది. 37 పంచాయతీల్లో రానున్న మూడు నెలల్లో కార్యదర్శుల పర్యవేక్షణలో చేపట్టనున్న పారిశుధ్య పనులకు గాను ముందస్తుగా 300 బ్లీచింగ్ బ్యాగులు, 250 సున్నం బ్యాగులు వచ్చినట్లు ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు. వీటిని ఆయా పంచాయతీలకు పంపిణీ చేస్తామన్నారు. నీటి ట్యాంకులు, కాలువలు, పరిసరాల్లో క్లోరినేషన్ చేపట్టేలా చర్యలు తీసకుంటామన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

కొత్తూరులో భారీ వర్షం

కొత్తూరు: మండల వ్యాప్తంగా మంగళవారం పిడుగులతో కూడిన వర్షం కుండపోతగా కురిసింది. ఉదయం ఉంచి భానుడి భగభగలతో వాతావరణం ఉండగా, సాయంత్రం వర్షపు జల్లులతో చల్లబడింది. మరో వైపు నెల రోజులుగా వర్షాలు అంతంతమాత్రంగా ఉండడంతో పొలాల్లో నీటి తడి లేకుండాపోయింది. మంగళవారం కురిసిన వర్షంతో పొలాల్లో నీరు చేరింది. ఇదే విధంగా ఎగువన వర్షాలు పడడంతో హడ్డుబంగి గెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. సరైన సమయంలో వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంశధార నీటితో రైతుల్లో ఆనందం

● మంత్రి అచ్చెన్నకు పలాస నేతల అభినందన

పలాస, జూలై 16: వంశధార శివారు భూములకు నీరు విడిచిపెట్టడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, దీని కోసం మంత్రి అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి అభినం దించారు. ఈ సందర్భంగా బాబురావు పలాసలో విలేకర్లతో మాట్లాడుతూ.. తమ నాయకురాలు గౌతు శిరీష ఎన్నికల వాగ్దానంలో భాగంగా 'ప్రతి చేతికి పని-ప్రతి చేనుకు నీరు' అనే నినాదాన్ని తీసుకు వచ్చారని, ఈ మేరకు గెలిచిన వెంటనే వంశధార నీరు శివారు భూములకు తీసుకువచ్చేందుకు కృషి చేశారని, దీనికి మంత్రి అచ్చె న్నాయుడు సహకరించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా వంశధార నీరు వచ్చిన పరిస్థితి లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో నేతలు యవ్వారి మోహనరావు, కొరికాన శంకర్, తమ్మినేని గంగాధర్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడుతున్న పలాస టీడీపీ నేతలు

చెరువు ఆక్రమణలను తొలగించండి: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: ఎర్ర చెరువులో ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలో ఎర్రచెరువు ఆక్రమణలపై టీడీపీ నేతలు ఆయన దృష్టికి తీసుకురాగా మంగళవారం సదరు ఆక్రమణలను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకుని కోట్ల రూపాయల విలువ చేసే భూములు ఆక్రమించుకుంటుంటే చూస్తూ ఎలా ఊరుకున్నారని అధికారులను ప్రశ్నించారు. కాగా గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు చేసిన సర్వేలో 30 సెంట్ల వరకు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించి ఆక్ర మణదారులకు నోటీసులు జారీచేసినట్లు అధికారులు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైఎస్ వీవీ ప్రసాదరావు, మండల సర్వేయర్ రామగణపతి, వీఆర్వో పార్థసారధి, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, నేతలు ఎస్.జోగారావు, నట్టు పాడి, అక్కుంద్ర సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రచెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, అధికారులు

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు



పలాసరూరల్: తర్లాకోట జగన్నాథ ఆలయంలో స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. మారు రథయాత్ర ముగియడంతో శ్రీమందిరానికి చేరుకున్న స్వామికి తులసిమాలలతో అలంకరించారు. భక్తులు దర్శించుకుని తరించారు. ● స్థానిక సీతారామాలయం కాంప్లెక్స్‌లోని జగన్నాథ ఆల యంలో జైజగన్నాథ్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కర్కాటక సంక్రమణ పూజలు, హోమం నిర్వహించారు. సంఘ కార్యదర్శి బాబూరావు పండా, రాఘవ పండా పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలు ఆదర్శంగా ఉండాలి

నరసన్నపేట: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు ఆదర్శంగా ఉండాలని, వీటిలో చేరేందుకు పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వసతిగృహ సంక్షే మాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలో ప్రతీ హాస్టల్ రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. తల్లిదండ్రుల్లా విద్యార్థుల బాగోగులు చూసుకోవాలని సూచించారు. హాస్టళ్లకు అవసర మైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి చాముండేశ్వరి, సూర్యప్రభ, వార్డెన్లు టి. పద్మావతి, పి.శ్రీలక్ష్మి, శివప్రసాదరావు, మోహనరావు, మాదవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సామాజిక విప్లవం తీసుకురావాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

కాశీబుగ్గ: దేశంలో సామాజిక విప్లవం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇది కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం కాశీబుగ్గలోని ఓ కల్యాణ మండపంలో సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీలు సామాజిక ఉద్యమం ద్వారా అసమానతలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజల హక్కులను ప్రధాని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, వీటిని కాపాడేం దుకు కేంద్ర ప్రభుత్వానికి మద్దతిస్తున్న టీడీపీ, జనసేనలు ముందుకు రావాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షిం చుకునేందుకు పార్లమెంట్‌లో నిలదీయాలని కోరారు. డిసెంబరు 26న కమ్యూనిస్టు పార్టీ శత వసంతాలు పూర్తవుతాయని, 2026 డిసెంబరు 26 వరకు అన్ని గ్రామాల్లో శత వార్షికోత్సవాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ఏర్పడినా ప్రజలకు మేలు జరిగే పరిస్థితులు కనిపిం చడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు ఈశ్వరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, సుందర్‌లాల్, నర్సింహులు, యుగంధర్, వేణుగోపాల్, శ్రీనివాస్, రవి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

ఘనంగా ఆవేటి వారాలు

నరసన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఆవేటి వారాలు నిర్వహించారు. గ్రామదేవతలకు మొక్కులు చెల్లించారు. ముర్రాటలు పోసి అమ్మవార్లకు చల్లదనం చేశారు. వర్షాకాలంలో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా అందరూ ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. జమ్ము, తామరాపల్లి, కంబకాయి, ఉర్లాం, కోమర్తి, మాకివలస, దేవాది, మడపాం తదితర గ్రామాల్లో ఆవేటి వారాలు నిర్వహించారు.

గ్రామదేవతకు ముర్రాటల సమర్పణ

తురకపేట(ఎల్.ఎన్.పేట): తురకపేట గ్రామంలో మంగళ వారం గ్రామదేవత అసిరితల్లికి గ్రామస్థులు ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. ఆషాఢ మాసంలో పౌర్ణమి ముందు మంగళవారం ఆవేటి వారాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ వారాలు చేసుకుంటే పాడి పంటలు వృద్ధి చెందుతాయన్న నమ్మకమని పి.దాసు, సీహెచ్ రామమోహనరావు, రమణ, ఎస్.గురివినాయుడు తదితరులు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామస్థులంతా ఒకేసారి కలశాలు పట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకాలతో ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నేతలు

వజ్రపుకొత్తూరు: ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గౌతు శిరీష, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీగా రామ్మోహన్‌నాయుడు మంచి మెజార్టీతో విజయం సాధించడంతో ఆ పార్టీ క్యాడర్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. హూండిలో మంగళవారం శ్రీపాలపోలమ్మ ఆలయానికి మేళతాళాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి రమణ, పుచ్చ ఈశ్వరరావు, పి.వేణుగోపాల్, సీపాన గోపి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎన్‌పేట: కలశాలతో వెళుతున్న మహిళలు

జవాన్ల మృతికి సంతాపం



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సంతబొమ్మాళి యువకులు

సంతబొమ్మాళి: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుదాడుల్లో మృత్యువాత పడిన చెట్లతాండ్రకు చెందిన డొక్కరి రాజేష్, నందిగాం మండలం వల్లభరాయుడుపేటకి చెందిన సనపల జగదీష్‌ల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ యువకులు నివాళి అర్పించారు. సంతబొమ్మాళిలో మంగళవారం రాత్రి అమరవీరుల చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించడంతోపాటు ర్యాలీ చేపట్టారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన జవాన్లు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

మొక్కుబడిగా మండల సమావేశం

టెక్కలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా సాగింది. పలువురు ప్రజా ప్రతినిధులు స్థానంలో వారి కుటుంబ సభ్యులు హాజరు కావడం కనిపించింది. విత్తనాలు, పెన్షన్ల పంపిణీలో అధికారులు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. గత సమావేశంలో లేవనెత్తిన అంశాలు ఎందుకు పరిష్కరించలేదని వాకాడ శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ పేడాడ రమేష్, సూపరింటెండెంట్ రమణమూర్తి, పలు శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

తనను బెదిరిస్తున్నారంటూ ఎమ్మెల్సీ ఫిర్యాదు

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల అనంతరం తనకు అనేక ఫోన్ నెంబర్లతో బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం టెక్కలి సీఐ షైడయ్యకు ఫిర్యాదు చేశారు. తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని శాసనమండలి ఛైర్మన్, డీజీపీ, ఎస్పీల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యులకు బీమా

కొత్తూరు: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకుని బీమా సదుపాయం పొందాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయరాజు, మండల ఉపాధ్యక్షుడు ఇసై వెంకటేష్, అడపాకల అశోక్ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ నెంబర్, సభ్యుడి ఫోన్ నెంబర్, సభ్యుడి ఫొటో, రూ. 500 ఇచి సభ్యత్వం పొందాలన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యజ్ఞంలా చేపడుతున్నారని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఎంపీడీవోగా ప్రేమలీల

సంతబొమ్మాళి: ఎంపీడీవోగా ప్రేమలీల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సంతబొమ్మాళి పంచాయతీలో జరిగిన వార్డు మెంబర్ ఉప ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులో తప్పిదం జరగడంతో ఎన్నిక వాయిదా పడిన సంగతి తెలిసింది. ఈ ఘటనపై విచారణచేపట్టి అప్పటి ఎంపీడీవో ప్రేమలీలను కలెక్ట ర్ సస్పెండ్ చేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఉమాసుందరి ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. ఇప్పుడు మరలా ప్రేమలీలను ఎంపీడీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వు లివ్వడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు

మందస: మందస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కార్యాలయంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీ చేపట్టినట్లు సమాచారం. కొనుగోలు, అమ్మకాలకు సంబం ధించిన రికార్డులను పరిశీలించారు. కార్యాలయ పని తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట సబ్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

19న బ్రాహ్మణ సంఘ సమావేశం

పలాసరూరల్: జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణసంఘ సమావేశం ఈ నెల 19న కాశీబుగ్గ పూజారి వీధిలో కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ త్యాడి, బాబూరావు పండా తెలిపారు. ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహితో పాటు జిల్లాస్థాయి ప్రతినిధులు హాజరుకానున్నారని, ఒడియా బ్రాహ్మణులంతా తరలిరావాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

వైసీపీ నాయకుల భూకబ్జాలపై నివేదిక ఇవ్వండి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: గాజులకొల్లివలస సమీపంలో వంశధార జలాశయం నిర్వాసితులకు ఏర్పాటుచేసిన ఆర్ఆర్ కాలనీలో వైసీపీ నాయకుల భూకబ్జాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్అండ్ఆర్ కాలనీలో పర్యటించారు. తొలుత ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయ కులు గొర్లె రామ శంకరరావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కాలనీలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశధార నిర్వాసితులు తమ సమస్యలు వివరించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్అండ్ఆర్ కాలనీకి మౌలిక వసతులు కల్పనతోపాటు, ప్రభుత్వ సహాయం అందిస్తామన్నారు. ఇక్కడ బ్లాకు రెండులో వైసీపీకి చెందిన ఓవ్యక్తికి ఇంటి స్థలం పట్టా మంజూరు చేసినట్లు, మరికొన్ని అనధికార డిపట్టాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో పలువురు నాయకులకు మంజూరుచేసినట్టు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే ఆర్అండ్ఆర్ కాలనీ సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో వాసుదేవరావు, ఎంపీటీసీ ప్రభావతి, సర్పంచ్ దమయంతి, టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, గొండు రమణమూర్తి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహాలకు ప్రాధాన్యం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం: పేదలకు పక్కాగృహాల నిర్మాణానికి ప్రాధాన్యతగా ఇవ్వనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా పేదవాడికి ఆకలి తీర్చడం ఎంత ముఖ్యమో, తలదాసుకోవడానికి పక్కాగృహం అంతే అవసరమన్నారు. ఈఏడాది పెద్దఎత్తున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.గతంలో నియోజకవర్గంలోని హౌసింగ్ కాలనీ స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇళ్ల నిర్మాణాల కోసం శనివారం నాటికి పూర్తి స్థాయి సమాచారం తన చేరవేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో పక్క గృహం లేని పేదవాడు ఉండకూడదనేదే తన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కె.అప్పారావు, ఏఈ మోహన్‌రావు, యువరాజ్, రమేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎన్ఈఆర్

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



గార: ఉచిత ఇసుకవిధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళ వారం సతివాడ వద్ద టీజీఐ కంపెనీ ఏడేళ్లుగా మూత పడినా, ఈ పరిశ్రమ వద్ద నిల్వ ఉండే ఇల్మనైట్, రుటైల్, ఇసుక చోరీకి గురవుతుండడంతో మైనింగ్ విజిలెన్స్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్రతీరం నుంచి కూడా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సహజ వనరులను దోచుకున్నారని ఆరోపించారు.ఆయన వెంట వాడాడ పంచాయితీ మాజీ సర్పంచ్, టీడీపి నాయకులు శిమ్మ శ్రీనివాసరావు, గిరిజా శంకర్, ఎస్.ఐ. కె.కృష్ణ ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాలన మారింది... పని తీరు మార్చుకోండి

అరసవల్లి: పాలన మారడంతో అధికారులు, సిబ్బంది పని తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. స్థానిక బాపూజీ కళామందిరంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, నగర కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి సమావేశం నిర్వహించారు. 48 సచివాలయాలను నాలుగు జోన్లగా ఏర్పాటు చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్షిస్తామని తెలిపారు. విలీన పంచాయతీల పరిధిలో సచివాలయాలకు సైతం కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అందరూ సమన్వయంతో నగరాభివృద్ధికి పనిచేయాలని కోరారు.

కాగువాడ త్రిపుర సుందరీదేవి ఆలయంలో చోరీ

పాతపట్నం: కాగువాడ గ్రామంలోని లలితా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాగువాడ శ్రీనగర్‌లోని లలితాత్రిపుర సుందరీదేవి ఆలయంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆలయ వెనుకభాగం నుంచి దొంగలు ఆలయంలో ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. సీసీ కెమెరాల కనెక్షన్‌లను తొలగించి ఆలయంలోకి ప్రవేశించారు. రెండుహుండీల్లోని మొత్తంతో పాటు అమ్మవారికి అలంకరించిన వెండి,బంగారు ఆభరణాలను దొంగిలించారు. గ్రామంలో జరిగిన ఫంక్షన్ల డీజేసౌండ్ల వల్ల తాళాలు పగులగొట్టినా వినిపించలేదని ఆలయంలోని అర్చకులు సునరాపు రాజేశ్వరరావు తెలిపారు. నల్లపూసల సేరు శతమానా లతో కలిపి బంగారుఆభరణాలు, మూడు కేజీల వెండి వస్తువులతోపాటు దొంగతనానికి గురైనట్లు తెలిపారు. రెండుహుండీల్లో సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీం కూడా వచ్చి పరిశీలించారు. ఎస్ఐ మహమ్మద్‌యాశిన్ చోరీప్రాంతాన్ని పరిశీలించారు. ఆలయ అర్చకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఇటీవల పాతపట్నం వెంకటేశ్వర ఆలయంలో చోరీ జరిగిన కొద్ది రోజుల్లోనే సోమవారం రాత్రి లలితా త్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం కావ డం, వారంరోజుల్లో పాతపట్నంలోని శాంతినగర్, ప్రశాంతినగర్, యశోదానగర్‌లలో పలు ఇళ్లలో చోరీలు జరిగిన నేపథ్యంలో పట్టణ వాసులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

పలాసరూరల్: పలాస మండలం అమలకుడియాకు చెందిన వివాహిత సిద్ధభక్తులకుమారి (50) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కాశీ బుగ్గ పోలీసులకథనం మేరకు..సిద్ధాభక్తులకుమారి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తోంది. వారంరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈబాధను తట్టుకోలేక పురుగుల మందుతాగింది. విషయంతెలుసుకున్న భర్తసోమేశ్వరరావు కుమారిని పలాస ప్రభుత్వాసుపత్రికి హుటాహుటిన తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో ఆమె మృతిచెందింది. సోమేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



మధు బరోడా (ఫైల్)

మెళియాపుట్టి: సుందరాడకు చెందిన మధు బరోడా (25) తల్లిదండ్రులు వివాహానికి ఒప్పుకోలేదని ఆదివారం రాత్రి పురుగుల మందుసేవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిని గమనించిన స్థానికులు పాతపట్నంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మధు బరోడా కొన్నేళ్ల … నుంచి హైదరాబాద్‌లో ఓప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు.అక్కడే ఒక యువతిని ప్రేమించాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు తెలిపాడు. అయితే ఇటీ వల ఒదిన మృతి చెందిందని, ఇప్పుడైతే వివాహం చేయలేమని వారు చెప్పడంతో మనస్థాపానికి గురై గ్రామ సమీపంలోని తోటలో పురుగుల మందు సేవించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని, దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

సోలార్ ప్యానెల్ దొంగిలించిన వ్యక్తుల అరెస్టు

బూర్జ: మండలంలోని వివిధ గ్రామాల్లో గల పంట పొలాల్లో రైతులకు సంబంధించిన సోలార్ ప్యానెల్‌ను దొంగలించిన ఎనిమిది మంది యువకులను మంగళవారం అరెస్టుచేసినట్లు ఎస్ఐ జీవీ ప్రసాద్ తెలిపారు.ఈ మేరకు 13 సోలార్‌ప్యానెళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా అసలైన నిందితులు విడిచిపెట్టి మిగతా వ్యక్తులను అరెస్టుచేశారని చీడివలస గ్రామస్థులు కొల్లివలస జంక్షన్ వద్ద నిరసన తెలిపారు.

ఇసుక ర్యాంపులో పోలీసుల పహారా



ర్యాంప్ వద్ద గస్తీ కాస్తున్న పోలీసులు

సరుబుజ్జిలి: మండలంలోని పెద్దసవలాపురం సమీపంలో వంశధార నదిలోగల ఇసుక ర్యాంప్‌లో మంగళవారం పోలీస్ పహరా ఏర్పాటు చేశారు. పెద్ద సవలాపురంలో అక్రమంగా ఇసుక ర్యాంపు నిర్వహించి యంత్రాలు, ట్రాక్టర్లతో అనధికారికంగా రవాణాచేస్తున్నారని, కొంతమంది నాయకులు పుకార్లు పుట్టించారు. దీంతో గ్రామంలో రెండు వర్గాల మధ్య మనస్పర్థలు ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశముందని ముందస్తుసమాచారం మేరకు జిల్లాయంత్రాంగం పోలీసులను అప్రమత్తంచేసింది. ఈనేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఆమదాలవలస, బూర్జ ఎస్ఐలు కె.వెంకటేష్, ప్రసాద్ సిబ్బందితో పాటు స్థానిక సరుబుజ్జిలి స్టేషన్ సిబ్బందితో ఆ గ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బద్రి రామారావుతో ఎస్ఐ ప్రసాద్ మాట్లాడి పోలీసులకు సహకరించాలని కోరారు.రెవెన్యూ అధికారులు కూడా పెద్దసవలాపురం గ్రామాన్ని సందర్శించి ఇసుక ర్యాంప్ ప్రాంతాన్ని పరిశీలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీతీర ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండుట్రాక్టర్లను సీజన్‌చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కొత్తవలస, నిమ్మతొర్లాడ గ్రామాల మధ్య సోమవారంరాత్రి నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుకతరలిస్తున్నట్టు సమాచారం అందిందని తెలిపారు. సిబ్బందితో వెళ్లి రెండు ట్రాక్టర్ల ఇసుకతో పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కాలువలో పూడికతీత

బూర్జ: నారాయణపురం కుడికాలువలో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభించారు.టీడీపీ నాయకుడు గోపిమాస్టార్ పర్యవేక్షించారు.

చిత్తశుద్ధి లేక.. సంపద రాక

● నిర్వహణ లేక మూలకుచేరిన పరికరాలు

● ఇదీ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం డంపింగ్ యార్డులో పరిస్థితి



నిరుపయోగంగా ఉన్న తడి-పొడి చెత్త కేంద్రం

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ సంబంధించిన డంపింగ్‌యార్డు నిర్వహణపై అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో సంపద సృష్టికి నోచుకోవడంలేదు. ప్రధానంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వర్మికంపోస్ట్ యూనిట్, తడి-పొడిచెత్త వేరుచేసే కేంద్రాలు, పల్వరైజర్ యంత్రం, వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఎరువులతయారీ కేంద్రాలు నిర్వహణ లోపం వల్ల మూలకుచేరాయి. ప్రధానంగా ఈ యార్డు నిర్వహణకు కనీసం 15 మంది సిబ్బంది అవసరం కాగా ఒక్కరే ప్రస్తుతం ఉన్నారు. -పలాస

కోసంగిపురం జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘం డంపింగ్‌యార్డు నిర్వహణ నీరుగారుతోంది. జిల్లాలోఅన్ని మునిసిపాలిటీల కంటే ఎక్కువ వైశాల్యంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. తొమ్మిది ఎకరాల్లో ఉన్న ఈ డంపింగ్ యార్డులో ప్రతిరోజూ మునిసిపాలిటీలో 50 టన్నుల వరకు వివిధ వ్యర్థాలు అక్కడ పోగుచేస్తుంటారు. అయితే వాటి నుంచి సంపద సృష్టించేందుకు అవకాశమున్నా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవ డడంతో సేకరించిన చెత్తను అక్కడే పోగులుపెట్టి విడిచిపెడుతున్నారు. దీంతో చెత్త కుళ్లడం వల్ల ఇక్కడ దుర్వాసన వెలువడడంతోపాటు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని పట్టణవాసులు చెబుతున్నారు. మునిసిపల్ అధికారులు చెత్త నిర్వహణపై దృష్టిసారించి ఉంటే సంపద రావడంతోపాటు ప్రజలకు దుర్వాసన సమస్య నుంచి విముక్తి లభించే అవకాశం ఉం డేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీఅధికారులు మాత్రం డంపింగ్‌యార్డును ఏటీఎం మాదిరిగా వినియోగించుకుని నిధులు దుబరా చేస్తున్నారే తప్పా ఒక్క అభివృద్ధిపనీ పూర్తి చేయలేకపోతున్నారన్న విమర్శలొస్తున్న విషయం విదితమే. డంపింగ్ యార్డు నిర్మాణ సమయంలోనే వర్మికంపోస్ట్ యూనిట్, తడి-పొడిచెత్త వేరు చేసే కేంద్రాలు, పల్వరైజర్, వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలకు నిర్మించారు. ఆ తర్వాత మునిసిపల్ అధికారులు నిర్వహణలోపం వల్ల శిథిలావస్థకు చేరాయి. 2019లో సంభవించిన తితలీ తుఫాన్ సమయంలో ఉన్న కాస్తా నిర్మాణాలు దెబ్బతినగా, పరికరాలు పాడయ్యాయి. దీంతో డంపింగ్ యార్డులో చెత్తను కాల్చి బూడిదచేయడం తప్పా సంపద విషయాన్ని అటకెక్కించారు. ప్రధానంగా జంట పట్టణాల్లో సేకరిస్తున్న చెత్త నుంచి ప్లాస్టిక్, కుళ్లినవ్యర్థాలు వేరుచేసి రీసైక్లింగ్ చేయాల్సిఉన్నా అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో డంపింగ్‌యార్డులో చెత్త పేరుకుపోతోంది. డంపింగ్ యార్డులో ప్రహరీ, మంచినీటి సౌకర్యాలు కూడా ఉన్నాయి. కొద్దిమంది సిబ్బందిని నియమించి డంపింగ్‌యార్డును అభివృద్ధిచేస్తే మునిసిపాలిటీకి దీర్ఘకాలిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం చొరత తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మూలకు చేరిన పల్వరైజర్ యంత్రం



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

నిధులు లేక అభివృద్ధి చేయలేకపోతున్నాం..

డంపింగ్ యార్డు నిర్వహణకు నిధులు లేకపోవడంతో అభివద్ధి చేయలేకపోతున్నామని పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. చెత్త సేకరణకు పనిముట్లు పూర్తిగా లేవని చెప్పారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. కొత్తగా నియమకాలు జరిగితే డంపింగ్ యార్డులో పూర్తిగా పనికి వినియోగించి అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే అశోక్‌కు సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న వడ్డిజల్లుపుట్టుగ గ్రామస్థులు

కవిటి: వడ్డిజల్లుపుట్టుగలో మంగళవారం ఎమ్మెల్యే అశోక్‌కు గ్రామస్థులు సన్మానించారు. ఇటీవల జరిగినఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, నాయకులు బి.రమేష్, పి. కృష్ణారావు, ఎస్‌వీ రమణ, బి.చిన్నబాబు, పి.దేవేంద్ర మూర్తి, బి.తిరుమలరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా: ఏడీ

సోంపేట: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 20లోగా వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు తెలిపారు.మంగళవారం మండలంలోని పలాసపురం,జింకిభద్ర, గొల్లవూరు, మామిడిపల్లిల్లో వరినారు మళ్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో నరసింహమూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి ఎస్సీ, ఎస్టీల సమస్యలు

సరుబుజ్జిలి: ఎస్సీఎస్టీల సమస్యలను కలెక్టర్, ఎస్పీదృష్టికి తీసుకువెళ్లినట్లు మూలసవలాపురానికి చెందిన జిల్లా ఎస్సీఎస్టీ సంఘ అధ్యక్షుడు గొల్లపల్లి ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సురేష్‌కుమార్ తెలిపారు.ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్వప్నల్‌దినకర్, ఎస్పీ కేవీమహేశ్వరరెడ్డిని మంగళవారం జిల్లాదళిత సంఘాల నాయకులు కలిశారు.కార్యక్రమంలో శశికుమార్, శ్రీధర్, సవంత, జగదీష్, తారకేష్, బుజ్జి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి

సోంపేట: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధిపనులకు సంబంధించి ప్రజాప్రతినిధులకు సమాచారంఇవ్వాలని ఎంపీపీ నిమ్మనదాసు తెలిపారు.మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా అధికారులు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం పాల్గొన్నారు.

రామిగెడ్డ పూడికతీత పనులు ప్రారంభం

అరసవల్లి: శ్రీకాకుళం మీదుగా ఖాజీపేట, కల్లెపల్లి, గ్రామీణ మండలంలోని శివారు భూములకు నీరందించే రామిగెడ్డ పూడికతీత పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా పనులు శరవేగంతో పూర్తి శివారు భూములకు కూడా నీరందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయరంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

బూర్జ: మండలంలోని అయ్యవారిపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఇప్పిలి శ్రీధర్ సొంత ఖర్చులతో గ్రామంతోపాటు నీలకంఠాపురం, అన్నంపేట, తిమడాంకు చెందిన 45 మంది విద్యార్థులను తోటవాడ ఉన్నత పాఠశాలకు ఉచితంగా మూడుఆటోల్లో ప్రయాణానికి ఏర్పాటుచేశాడు.ఇటీవల గ్రామంలో ఓయువకుడు పిడుగుపాటుకుగురై మృతిచెందడం తనను కదిలించిందని, ఇలా మరోవిద్యార్థి జీవితం బలికూడదని ఈనిర్ణయం తీసుకున్నట్లు శ్రీధర్ తెలిపాడు.

ఇచ్ఛాపురంలో కర్కాటక సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కర్కాటక సంక్రమణం పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయప్రాంగణంలో అన్నదానకార్యక్రమం ఏర్పాటుచేశారు.అలాగే గాంధీ పార్క్ ఎదురుగాఉన్న ముత్యాలమ్మతల్లి,మండపల్లిలోగల గారపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయాల్లో కూడా సంక్రమణం పూజలు నిర్వహించారు.

సమాజంలో మార్పుకు జనసేనతో పనిచేయండి



మాట్లాడుతున్న చంద్రమోహన్

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో మంచి మార్పు తీసుకురావడం కోసం జనసేన పార్టీతో కలిసి పనిచేయాలని ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిశిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలో జన సేన పార్టీజిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం నుంచి 28వరకు పార్టీ క్రియాశీలక సభ్యత్వనమో దులో భాగస్వామ్యంకావాలని కోరారు. ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.ఐదులక్షల చొప్పున మూడేళ్ల నుంచి అందజేస్తున్నట్లు తెలిపారు.గతంలో తీసుకున్న వారి సభ్యత్వాలను రెన్యు వల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, నగర నాయకులు, పాండ్రంకి రమేష్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు పాత్రుని పాపారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో అమ్మవార్లకు చల్లదనోత్సవాలు



గార: బూరవెల్లిలో ఆలయానికి ముర్రాటలు తీసుకువెళ్తున్న మహిళలు

శ్రీకాకుళంకల్చరల్: శ్రీకాకుళంలోనిజడ్పీ వద్ద అసిరమ్మ, ఎల్‌బీఎస్‌కాలనీలో ముత్యాలమ్మ, రెల్లవీధిలో మరిడమ్మ, కొన్నావీధిలో పాదాలమ్మ, పుణ్యపువీధిలో దుర్గమ్మ, న్యూకా లనీలో నీలమ్మ అమ్మవార్లకు చల్లదన ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అమ్మవార్లకు చీరలు చూపించి, పసుపు కుంకుమలతో పూజలుచేశారు.మరిడమ్మఉత్సవాల్లో ఎమ్మెల్యే గొండుశంకర్ పాల్గొన్నారు. ఆయనకు మంగళహారతులు, మేళతాళాలతో ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

● **గార:** మండలంలోని బూరవెల్లిలో మంగళవారం అసిరితల్లి వారాలు ఘనంగా నిర్వహించారు.మహిళలు ముర్రాటలను మేళతాళాలతో ఆలయానికి తీసుకువెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుజరాతీపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవతే ప్రమాదాలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మోటారు వాహనాల చట్టంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు నియామాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.ఇందిరా ప్రసాద్, పీబీ మల్లేశ్వరరావు, కె.రవిశంకర్, యు.రమేష్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

కంచిలి: తమకు గౌరవేతం చెల్లించాలని వలంటీర్లు కోరారు. మంగళవారం ఎంపీడీవో వి.నీరజకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి గౌరవ వేతనం అందడం లేదని తెలిపారు.

దరఖాస్తు గడువు పెంపు

ఎచ్చెర్ల: యోగా అండ్ ఫిట్‌నెస్ మేనేజ్ మెంట్ విభాగం ఆఫర్‌చేస్తున్న ఏడాది యోగా పీజీడిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెలాఖరు వరకు పొడిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఆచార్య పి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.అదనపు రుసుము లేకుండాఈనెల 31 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ కోర్సులో చేరడానికి అర్హులని తెలిపారు. కోర్సుఫీజు రూ.పదివేలు కాగా వర్సిటీలో ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు 30 శాతం, బోధన, బోధనేతర సిబ్బందికి 50 శాతం ఫీజులో రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొంది, దీనికి రిజిస్టర్ పేరిట తీసిన రూ200 ఆన్‌లైన్ ఫీజు రశీదు జత చేసి వర్సిటీ యోగా విభాగంలో దరఖాస్తును అందజేయాలని కోరారు.

యోగా కోర్సు కోఆర్డినేటర్‌గా మూర్తి

అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డిపార్టుమెంట్ ఆఫ్ యోగా అండ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న కేవీఎన్ మూర్తిని ఆ విభాగం కోర్సు కోఆర్డినేటర్‌గా వర్సిటీ వీసీ కేఆర్ రజని నియమించారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు.

బాల సంజీవిని పంపిణీ

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఏడు, ఎనిమిది వార్డుల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు బాలసంజీవిని మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి రంగాల శ్రీనివాస్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి తెలిపారు. మంగళవారం కోర్టు ఆవరణలో హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీపీ సీపాన గోవిందరావు, బార్ మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు పైడి వరహానరసింహం, న్యాయవాదులు బొడ్డేపల్లి మోహన్‌రావు, తమ్మినేని అన్నంనాయుడు, వాడవలస రాజేశ్వరరావు పాల్గొన్నారు.

శేషపాన్పు అవతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళంకల్చరల్: శ్రీకాకుళంలోని మొండేటి వీధిలోగల లలిత సహిత శివకామేశ్వరస్వామి ఆలయం, షిర్డీ సాయిబాబా మందిరం ఆవరణలో రథయాత్ర మహోత్సవంలో భాగంగా మంగళవారం జగన్నాథ స్వామి వారు శేషపాన్పు అవతారంలో దర్శనమిచ్చారు. గుజరాతిపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో రామ పట్టాభిషేకం అవతారంలో అర్చకులు పెంట శ్రీనివాస్ శర్మ ఆర్వర్యంలో అలంకరించారు.

● **గార:** కళింగపట్నంలో జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా మారు రథయాత్ర నిర్వహించారు. గ్రామంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు.